తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక

మే 2020

సప్తగిరి అనుబంధం




## ప్రహ్లాదవరద నరసింహా!



బ్రహ్మోత్సవాలలో బాలకృష్ణుడు

తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం

సంపుటి: 01

మే 2020

సంచిక: 03

## విషయసూచిక

| | | పుట |
|---|---|---|
| హిందూదేవుళ్లు | శ్రీకూర్మావతారం<br>- డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు | 04 |
| పన్నిద్దరాళ్వార్లు | పేయాళ్వారు<br>- శ్రీ వైద్యంవేంకటేశ్వరాచార్యులు | 06 |
| కన్నడహరిదాసవరేణ్యులు | శ్రీవ్యాసరాయలు<br>- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 08 |
| చిత్రకథ | అభిషేకానికి ఆకాశగంగ<br>కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: కె.ద్వారకనాథ్ | 10 |
| బాలనీతి | బాల్యంలోనే... జ్ఞానం ఆర్జించాలి<br>- డా॥ సముద్రాల లక్ష్మణయ్య | 14 |
| విశిష్టబాలుడు | | 16 |
| క్విజ్ | నిర్వహణ: శ్రీమతి వి.ఉమారాణి | 17 |
| చిత్రలేఖనం | | 18 |

ముఖచిత్రం : ప్రహ్లాదవరద నరసింహా!

వెనుక చిత్రం : సీతా శోకనివారణ హనుమంతా!!

హిందూ దేవుళ్లు

# శ్రీకూర్మావతారం

- డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

కూర్మం అంటే తాబేలు. శ్రీమహావిష్ణువు మత్స్యావతారం తరువాత కూర్మావతారం ఎత్తవలసి వచ్చింది. ఈ అవతారంలో రాక్షస సంహారం ప్రత్యక్షంగా జరగలేదు, కాని దేవతలకు రక్షణ కలిగింది.

దేవతలు, రాక్షసుల మధ్య' తరచూ యుద్ధాలు జరుగుతుండడం వల్ల వారి సంఖ్య రోజురోజుకు క్షీణించసాగింది. దీనిని గమనించి శ్రీమహావిష్ణువు దేవతలకు మరణం లేకుండా అమృతాన్ని సాధించమని సూచించాడు.

అంతేకాకుండా పాలసముద్రంలో అనేక రకాల మూలికలను, ఓషధులను, లతలను వేసి మథించవలసిందిగా, అందుకు రాక్షసుల సహాయం కూడా తీసుకోవాల్సిందిగా శ్రీమహావిష్ణువు దేవతలను కోరాడు.

పాలసముద్రాన్ని మథించడానికి రాక్షసులు, దేవతలు సిద్ధమయ్యారు. వాసుకి అనే నాగసర్పం మంథర పర్వతాన్ని ఆధారంగా చేసుకుని చుట్టలు చుట్టుకోగా రాక్షసులు ఆ సర్పం పడగ వద్ద, దేవతలు తోకవద్ద నిలబడి పాలసముద్రాన్ని చిలకడం మొదలుపెట్టారు. మంథర పర్వతానికి ఆధారం లేకపోవడంవల్ల అది సముద్రంలోకి క్రుంగిపోసాగింది.


అప్పుడు శ్రీమహావిష్ణువు శ్రీకూర్మనాథుడిగా పాలసముద్రంలోంచి ఉద్భవించి మంథర పర్వతాన్ని తన వీపుమీద పెట్టుకొన్నాడు. ఆ గిరి శిఖరం మీద గరుత్మంతుని రూపంలో కూర్చుని ఆ పర్వతం స్థిరంగా నిలబడేలా చేశాడు. సముద్రమథనం మొదలైంది.

ఈ మథనంలో క్షీరసముద్రం నుండి ఐరావతం, (తెల్లటి ఏనుగు) కల్పవృక్షం, ఉచ్చైశ్రవం (తెల్లటి గుఱ్ఱం), కామధేనువు, చందమామ,

లక్ష్మీదేవి మొదలైనవారు ఉద్భవించారు. కాలకూటవిషం కూడా పెల్లుబికింది. చివరగా అమృతం లభించింది.

ఈ అమృతాన్ని రాక్షసులకు దక్కకుండా దేవతలకు మాత్రమే లభించేటట్లు శ్రీమహావిష్ణువు చేశాడు. ఇందుకు ఆయన మోహినిగా మారి తన అందచందాలతో రాక్షసులను భ్రమింపజేసి అమృతాన్ని దేవతల వశం చేశాడు.

శ్రీకూర్మనాథుడు వైశాఖపూర్ణిమనాడు అవతరించాడు. అందుకే ఆ రోజు శ్రీకూర్మజయంతి. ఈ కూర్మావతారానికి సంబంధించిన విశేషాలు భాగవతపురాణంలో, అగ్నిపురాణంలో, రామాయణం బాలకాండలో ఉన్నాయి. విశాఖపట్టణానికి చేరువగా ఉన్న శ్రీకూర్మం సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఇది గాక కర్నూలు జిల్లా ఆస్పరి దగ్గర 'నల్లగట్టు శ్రీకూర్మనాథక్షేత్రం' ఇటీవలి కాలంలో ప్రాచుర్యం పొందుతున్నది.



శ్రీకూర్మనాథుణ్ణి సేవిస్తే కార్యసిద్ధి అవుతుంది. సుఖశాంతులు లభ్యమౌతాయి. ఊర్ములను నశింపజేయువాడు కూర్ముడు. ఊర్మి అనగా వేదన. ఆకలి, దప్పిక, దుఃఖం, మోహం, వృద్ధాప్యం, మరణము ఈ ఆరు షడూర్ములు. వీటన్నింటిని తొలగించేవాడు శ్రీకూర్ముడు.

పన్నిద్దరాళ్వార్లు

# పేయాళ్వారు

- శ్రీ వైద్యంవేంకటేశ్వరాచార్యులు

పేయాళ్వారు శ్రీమహావిష్ణువు ఖడ్గం అయిన 'నందకం' అంశలో అవతరించారు. మొదలాళ్వారులలో వీరు మూడవవారు. వీరు (నేటి చెన్నైలోని మైలాపూర్) మయూరనగరంలో మణికైరవం అనే బావిలోని ఎఱ్ఱకలువల నుండి అవతరించారు. సిద్ధార్థినామసంవత్సరం చాంద్రమాన ఆశ్వయుజ శుక్లపక్షదశమి శతభిషా నక్షత్రంనాడు వీరు అవతరించారు.


'పేయ్' అంటే పిచ్చి, భ్రాంతి అని అర్థం. భగవంతునియందే మనసు, పేయ్/ పిచ్చిగా తిరుగుతూ ఉండడం చేత వీరికి పేయాళ్వారు అనే పేరు ప్రచారం పొందింది. పేయాళ్వారు 'మూన్ఱాం తిరువందాది' అనే దివ్యప్రబంధాన్ని రచించారు. ఈ దివ్యప్రబంధంలో నూరుపాశురాలు ఉన్నాయి.



ఈ దివ్యప్రబంధంలో పేయాళ్వారు 01)తిరువరంగం, 02)తిరుక్కుడందై, 03)తిరువిణ్ణగరం, 04)తిరుక్కోట్టియూరు, 05)తిరుక్కచ్చి, 06)అష్టభుజం, 07)వేళుక్కై, 08) తిరుఊరగం, 09)తిరువెనికా 10)తిరువెక్కణి 11)తిరుఘటికై, 12)తిరువెంగడం, 13)తిరుప్పాన్ కడల్, 14)పరమపదం వంటి దివ్యతిరుపతులను కీర్తించారు.

తిరుమలలో వేంచేసి ఉన్న వరాహస్వామి వారిని పేయాళ్వారు పది పాశురాలలో మంగళాశాసనం చేశారు.

మొదలాళ్వార్లు (పొయ్‌గై ఆళ్వారు, పూదత్తాళ్వారు, పేయాళ్వారు) పగటి పూట సంచారం చేస్తూ రాత్రులలో మాత్రం ఏదైనా గ్రామంలో ఉండేవారు. ఈ ముగ్గురు ఆళ్వార్లు ఒకనాడు రాత్రి తిరుక్కోవలూరుకు చేరుకుంటారు. అక్కడ ఒకరికి మాత్రమే సరిపడేటంత చోటు ఉంటుంది. ఆ ఇరుకుస్థలంలోనే ముగ్గురు ఆళ్వారులూ నిలుచుని భగవద్గుణానందాన్ని పొందుతారు.



తిరుక్కోవలూరు ఆలయంలో ఉన్న పెరుమాళ్లు ఈ ముగ్గురు ఆళ్వారులను పరీక్షించాలని అనుకుంటాడు. వెంటనే, తాను నాలుగో వ్యక్తిగా మారి వారి మధ్యకు వచ్చి హరిగానం చేస్తాడు. అపార కరుణా మయుడైన శ్రీమన్నారాయణుడు ఆ ముగ్గురు ఆళ్వారులకు దర్శనమిస్తాడు. ఆ ముగ్గురూ దేవదేవునకు ప్రణామాలు చేసి, వేదాంత సూక్తులతో కవితాత్మకంగా పెరుమాళ్లను సన్నుతిస్తారు.

కన్నడ హరిదాస వరేణ్యులు

# శ్రీవ్యాసరాయలు

– శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

"*కృష్ణా! నీ బేగనే బారో..*" అనే కీర్తనను సంగీత కచేరీలలోను, భరతనాట్యప్రదర్శనలోనూ మనం వింటూనే ఉంటాం. ఈ పాటను పాడిన వారు శ్రీవ్యాసరాయలు. ఈయన పాడుతుంటే శ్రీకృష్ణుడు బాలుడుగా నాట్యమాడేవాడని ప్రతీతి. బాలలూ... మరి వీరి గురించి మనం తెలుసుకుందామా..!

శ్రీవ్యాసరాయలవారి తల్లిదండ్రులు లక్ష్మీదేవి, రామాచార్యులు. శ్రీవ్యాసరాయలవారు బాల్యంలోనే శ్రీబ్రహ్మణ్యతీర్థుల దగ్గర, ఆ తర్వాత శ్రీపాదరాయలవారి దగ్గర విద్యాభ్యాసం చేసి క్రమంగా ద్వైత, వేదాంత తత్త్వాన్నంతా ఆపోసన బట్టారు.

వ్యాసరాయలవారు గొప్ప మహిమాన్వితులు. చంద్రికాచార్యులుగా ప్రసిద్ధి పొందిన శ్రీవ్యాసరాయలవారు శ్రీపురందర దాసు, కనకదాసులకు ప్రత్యక్ష గురువులు. తమ జీవితంలో ఎన్నో మహిమలను పరోపకారార్థం చూపినవారు.




ఈనాడు ముఖ్యంగా దేశంలోని గ్రామగ్రామాల్లో శ్రీఆంజనేయస్వామి ప్రాచీన దేవాలయాలన్నీ హనుమ, భీమ, మధ్వావతారాలు గోచరించేటట్లు 700 పైగా శిలామూర్తుల్ని శ్రీవ్యాస

రాయలవారు స్థాపించారు. హంపీలో గల యంత్రోద్ధారక ఆంజనేయస్వామి వీరి వల్లనే పూజింపబడ్డారు.

అంతేగాక, ఆనాడు శ్రీకృష్ణదేవరాయలకు 'కుహూ యోగం' అనే 'కాలసర్పదోషం' సంభవించినప్పుడు శ్రీ వ్యాస రాయలు ఆ దోషాన్ని పోగొట్టి ఆ తర్వాత 12 సంవత్సరాలు తిరుమల శ్రీనివాసుణ్ణి శాస్త్రోక్తంగా సేవించారు.

శ్రీవ్యాసరాయలు ప్రజలలో ధార్మికప్రవృత్తిని, జాగృతిని కల్గించినవారు. భక్తి, జ్ఞాన, వైరాగ్యాల్ని ప్రబోధించినవారు. భాగవత ధర్మాన్ని చక్కగా కన్నడ పద, పద్యాలలో ప్రబోధించారు.

మహాపాపాలైన జారత్వ, చోరత్వ, క్రూరత్వాలను గురించి వ్యాసరాయలు చెబుతూ మానవులు ఎవరైనా సరే మహాపాపాలను తెలిసి చేసినా, తెలీక చేసినా వాళ్లు శ్రీకృష్ణుని ముందు శరణాగతులై, పశ్చాత్తాప బుద్ధితో ప్రార్థిస్తే చాలు ఈ కలియుగంలో తపస్సు, యజ్ఞ యాగాది వ్రతాదుల కన్నా అధికఫలమని చెప్పిన భక్త శిరోమణి వ్యాసరాయలు.




'సిరికృష్ణ' వీరి అంకిత నామం.


చిత్ర కథ

# అభిషేకానికి ఆకాశగంగ

కథ- డి. శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- కె. ద్వారకనాథ్


యామునాచార్యుల ఆదేశానుసారం భక్తిప్రపత్తులతో శ్రీవేంకటేశ్వరుని అభిషేకానికి నిత్యమూ దివ్యజలాన్ని పాపనాశనతీర్థం నుంచి తెస్తున్నాడు శ్రీశైలపూర్ణుడు. ఒకరోజు ఒకబోయ ఆయనకు దారిలో ఎదురై...










కోపంతో శ్రీశైలపూర్ణుడు చర చరా నడిచి వెడుతున్నాడు. ఆయన వెనకే నడుస్తూ ఆయన తల మీద ఉన్న నిండు కుండకు బాణంతో రంధ్రం చేశాడు బోయ. అందులో నుంచి కారుతున్న నీళ్లని తాగుతున్న బోయను చూసి కసురుకున్నాడు శ్రీశైలపూర్ణుడు.




ఊఁ.. త్వరగా అదేంటో చెప్పు
అదుగో అక్కడ ఒక దివ్యతీర్థం ఉంది. పద.. చూపిస్తా.
4
ఇద్దరూ కలిసి ఆ ప్రదేశానికి వెళ్లి చూస్తే అక్కడ తీర్థం లేదు. వెంటనే బోయవాడు బాణంతో కొండకి రంధ్రం చేశాడు. అందులోంచి స్వచ్ఛమైన జలధార వచ్చింది.
స్వామీ! ఇది ఆకాశగంగ... నీళ్లు అమృతమే అనుకో.. రోజూ వచ్చి ఈ నీళ్లే అభిషేకానికి తీసుకెళ్ళు...
5
ఆఁ ఆఁ అలాగే పట్టుకెడతాను లే! అసలు నువ్వెవరూ...
6
సామీ! ఏంటా చూపు... నా మొహాన బొమ్మలాడుతున్నాయా ఏంటి?
నువ్వు.. బోయవా? లేక... నా స్వామి వా?
7


సరిగా చూడు! నిజం నీకే అర్థమౌతుంది!
ఆఁ నిజం తెలిసింది లే! నువ్వు బోయవి కావు! నువ్వు నా స్వామి వే!
8
అంతవరకూ విలాసంగా నవ్వుతూ నిలబడ్డ బోయ క్షణంలో శ్రీవేంకటేశ్వరునిగా మారి మాయమయ్యాడు. శ్రీశైలపూర్ణుని చేతికి పగిలిన కుండ పోయి కొత్తకుండ వచ్చింది.
శ్రీనివాసా! నీ లీలలు అద్భుతం.. పరమాద్భుతం! నన్ను కరుణించడానికి వచ్చావా?
9
గబగబా కొత్తకుండలోకి ఆకాశగంగ జలాన్ని నింపుకుని ఆనందనిలయానికి చేరుకున్నాడు శ్రీశైలపూర్ణుడు. అర్చకుణ్ణి ఆవహించిన స్వామి...
ఇకనుంచి ఆకాశగంగ జలాన్నే అభిషేకానికి వినియోగించండి!
గోవిందా! గోవిందా!
10




కాలక్రమంలో శ్రీశైలపూర్ణుడు తిరుమల నంబిగా ప్రసిద్ధుడయ్యాడు.
ఈయన శ్రీరామానుజాచార్యుల వారికి మేనమామ. గురువు కూడా.
ఇప్పటికీ ఈ భాగవతోత్తముణ్ణి గుర్తు చేసుకుంటూ
తిరుమలలో అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా
'తన్నీరముదు ఉత్సవం' జరపడం సంప్రదాయమైంది.

వచ్చే సంచికలో... స్వామి పుష్కరిణిలో స్నానం చెయ్యగానే
ధర్మగుప్తుని పిచ్చి ఎలా కుదిరిందో చదివి తరిద్దాం!

స్వస్తి!




# బాల్యంలోనే...
# జ్ఞానం ఆర్జించాలి

– డా॥ సముద్రాల లక్ష్మణయ్య

సముద్రే శాంతకల్లోలే,
స్నాతు మిచ్ఛతి మూఢధీః ।
తథైవ శాంతే సంసారే,
జ్ఞాన మిచ్ఛతి దుర్మతిః ॥

మానవుడు ఇతర ప్రాణుల కంటే శ్రేష్ఠుడు కావడానికి జ్ఞానమే కారణం. అయితే జ్ఞానాన్ని బాల్యంలో కాక వయసు పైబడిన తర్వాత ఆర్జించుకోవచ్చులే అని అనేకులు భావిస్తారు. అది తగదు. బాల్యంలోనే జ్ఞానార్జనకు ప్రయత్నించాలి. ఈ క్రింది సంఘటన ద్వారా ఈ విషయం గ్రహించండి.


ఒక వ్యక్తికి చర్మవ్యాధి సోకింది. అల్లోపతి, హోమియోపతి మున్నగు చికిత్సలకు చెందిన వైద్యులను అతడు సంప్రదించాడు. వారు ఇచ్చిన మందులకు ఆ వ్యాధి నయం కాలేదు. చివరికి అతడు ఆయుర్వేద వైద్యుని ఆశ్రయించాడు.

ఆ వైద్యుడు కూడా పలు రకాలమందులు ప్రయోగించాడు. అయినా వ్యాధి నయం కాలేదు. అప్పుడు ఆ వైద్యుడు రోగితో "ఇది మందులకు నయమయ్యే రోగం కాదు. నీవు వెంటనే సముద్రం వద్దకు వెళ్లి అందులో స్నానం చేస్తే బాగు పడతావు" అని సలహా ఇచ్చాడు.

ఆ రోగి అంతవరకు సముద్రం చూచిన వాడు కాదు. వైద్యుని సూచనల మేరకు సుదూరంలోని సముద్రం చెంతకు వెళ్లాడు. ఆ సాగర తీరంలో కూర్చున్నాడు. ఉదయం నుండి సాయంసమయం వరకు అలాగే

అక్కడ కూర్చుని ఉండిపోయాడు. అతణ్ణి చూసిన వారు "ఎక్కడి నుండి వచ్చావు? ఎందుకు ఇలా ఊరక కూర్చుని ఉన్నావు? అని ప్రశ్నించారు.

"నేను తిరుపతి నుండి ఈ సముద్రంలో స్నానం చేయడానికి వచ్చాను" అని అతడు సమాధానం చెప్పాడు. "అయితే స్నానం చేయ వచ్చు కదా? ఇలా ఊరక ఎందుకు కూర్చున్నావు?" అని వారు మళ్లీ ప్రశ్నించారు.



అందుకు అతడు "ఈ అలలు నిలిచిన తరువాత స్నానం చేద్దామని ఇక్కడ కూర్చున్నాను" అని చెప్పాడు. అతని తెలివి తక్కువ తనానికి వారు నవ్వుకొన్నారు.

సముద్రంలో అలలు శమించిన తరువాత స్నానం చేస్తాను అన్నవాడు మూఢుడు. అలలు ఎప్పటికీ శమించవు కదా!

అట్లే వయసు పైబడిన తరువాత వార్ధక్యం ముంచుకొని వచ్చిన తరువాత జ్ఞానం ఆర్జిస్తాను, అని అనుకున్నవాడు కూడా మూఢుడే. బాల్యంలోనే జ్ఞానార్జనకై ప్రయత్నించాలి.



# విశిష్టబాలుడు

| | | |
|---|---|---|
| పేరు | - | ఇ.చక్రధర్ |
| తరగతి | - | 2వ తరగతి |
| పుట్టిన తేది | - | 26-11-2012 |
| తండ్రిపేరు | - | ఇ.వెంకటరమేష్, సీనియర్ జె.సి.ఓ., ఇండియన్ ఆర్మీ |
| తల్లిపేరు | - | శ్రీమతి డి.శ్రీదేవి, సీనియర్ ఆఫ్‌సెట్ ప్రింటర్, తి.తి.దే. ముద్రణాలయం, తిరుపతి |
| పాఠశాల | - | మేక్ మై బేబి జీనియస్, తిరుపతి. |

## ఈ బాలమేధావి సాధించిన విజయాలు

### ఎల్.కె.జి.లో...

**01)** 22-4-2017న 210 నామవాచకాలను 78 క్షణాలలో అలవోకగా అప్పజెప్పడం.

**02)** 05-06-2017 సం॥లో 100 వేమన పద్యాలను-200 మంది విద్యార్థుల మధ్యన ఏకధాటిగా అప్పజెప్పడం వల్ల జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు అయ్యింది.

### యు.కె.జి.లో...

**01)** వేమన శతకరత్న పురస్కారం.

**02)** గీతాబాల పురస్కారం (12, 15 అధ్యాయాలు).

**03)** 03-06-2018 సం॥లో 100 వేమన పద్యాలను-300 మంది విద్యార్థుల మధ్యన ఏకధాటిగా అప్పజెప్పడం వల్ల జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు అయ్యింది.

### 1వ తరగతిలో...

క్షణిక గణిక పురస్కారం - 20 ఎక్కాలు ఏకబిగిన అప్పజెప్పడం.

# క్విజ్

**నిర్వహణ-**
**శ్రీమతి వి.ఉమారాణి**

**1) వాలి ఎవరి అంశలో జన్మించాడు?**

అ) ఇంద్రుడు ఆ) చంద్రుడు
ఇ) కుబేరుడు ఈ) యముడు

**2) నలుడు ఎవరి అంశలో జన్మించాడు?**

అ) ఇంద్రుడు ఆ) విశ్వకర్మ
ఇ) కుబేరుడు ఈ) యముడు

**3) సుగ్రీవుడు ఎవరి అంశలో జన్మించాడు?**

అ) ఇంద్రుడు ఆ) చంద్రుడు
ఇ) సూర్యుడు ఈ) బృహస్పతి

**4) నీలుడు ఎవరి అంశలో జన్మించాడు?**

అ) అగ్నిదేవుడు ఆ) విశ్వకర్మ
ఇ) కుబేరుడు ఈ) ఇంద్రుడు

**5) బుధుడి తండ్రి ఎవరు?**

అ) చంద్రుడు ఆ) ఇంద్రుడు
ఇ) సూర్యుడు ఈ) బృహస్పతి

**6) రోహిణి భర్త ఎవరు?**

అ) చంద్రుడు ఆ) ఇంద్రుడు
ఇ) సూర్యుడు ఈ) బృహస్పతి

**7) సీతాన్వేషణకు వానరులు బయలుదేరిన మాసం?**

అ) పుష్యం ఆ) కార్తికం
ఇ) ఆశ్వయుజం ఈ) చైత్రం

---

**జవాబులు**

1) అ 2) అ 3) ఇ 4) అ 5) అ 6) అ 7) ఇ

# చిత్ర లేఖనం

ఈ బొమ్మకు
రంగులు వేద్దామా...



పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...



తిరుమలలో... వేదపారాయణం చేస్తున్న వేదవిద్యార్థులు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-05-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742.
Postal Regd.No.TRP/10- 2018-2020, Licensed to post without prepayment
No.PMGK/RNP/WPP-04/2018-2020

